సాక్షి రాజన్న సిరిసిల్ల

సోమవారం ⬩ 27 ⬩ నవంబర్ ⬩ 2023



కేంద్ర బలగాల కవాతు

వేములవాడ: కేంద్ర బలగాలు వేముల వాడలో ఆదివారం ఉదయం కవాతు నిర్వహించాయి.



రాజన్నకు జనసందడి

వేములవాడ: రాజన్నను ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్టం/కనిష్టం
30.0/21.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాజ్యాంగం గొప్పతనం చాటిచెప్పాలి



కలెక్టరేట్‌లో ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్

సిరిసిల్ల: భారత రాజ్యాంగ విలువలను, ప్రాథమిక సూత్రాలను తెలుసుకొని, చాటిచెప్పాలని జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని అధ్యయనం చేయాలని సూచించారు. దేశ అభివృద్ధికి రాజ్యాంగం దిక్సూచిలాంటిదన్నారు. రాజ్యాంగం గొప్పతనాన్ని భావితరాలకు తెలపాలని కోరారు. భారత రాజ్యాంగ ప్రవేశిక పత్రాన్ని చదివి జిల్లా అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, డీపీఆర్వో మామిండ్ల దశరథం, కలెక్టరేట్ ఏవో రామ్‌రెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులను కేసీఆర్ దగా చేశారు

- ఆర్టీసీ ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి



మాట్లాడుతున్న రాజిరెడ్డి

సిరిసిల్లటౌన్: ఆర్టీసీ కార్మికులను ఏళ్ల తరబడిగా సీఎం కేసీఆర్ దగా చేశారని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలేవి అమలు చేయలేదన్నారు. 2013లో ఇచ్చిన జీతాలే ఇప్పటికీ వస్తున్నాయని, జీతాల పెంపు ఎక్కడ జరిగిందన్నారు. ఏరియర్స్ ఏవని, రిటైర్డ్ సెటిల్‌మెంట్స్ ఇవ్వడం లేదన్నారు. కేసీఆర్‌ను గద్దె దింపడమే ఆర్టీసీ కార్మికుల లక్ష్యంగా పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మహేందర్‌రెడ్డి, ఆర్టీసీ నాయకులు బాణయ్య, గర్దాస్ శ్రీనివాస్, గొట్టె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వసతులు కల్పించండి

- దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేందర్



మాట్లాడుతున్న రాజేందర్

సిరిసిల్లటౌన్: జిల్లాలోని అన్ని పోలింగ్ బూతుల్లో దివ్యాంగులు ఓటుహక్కును వినియోగించుకునేలా వసతులు కల్పించాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రాజేందర్ కోరారు. పోలింగ్ కేంద్రాల్లో వీల్‌చైర్స్, వలంటీర్స్‌ను నియమించాలన్నారు. సిరిసిల్లలోని సత్యసాయి సేవామందిరంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. దివ్యాంగులు సులువుగా ఓటుహక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. డిసెంబర్ 3న దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల పౌరసంక్షేమ సమితి ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 6న బహుమతులు అందిస్తామన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, వెల్డి గణేశ్, బొద్దుల రవి, మామిడాల నరేశ్, అంబటి శ్రీనివాస్, మిట్టపల్లి రమేశ్, యెల్లె హరిప్రసాద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



సిద్దార్థ పాఠశాలలో కబడ్డీ సెలక్షన్స్

సిరిసిల్లటౌన్: రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలకు సిరిసిల్లలోని సిద్దార్థ పాఠశాలలో జట్టును ఎంపిక నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా సుమారు 200 మంది పాల్గొనగా డిసెంబర్ 4వతేదీ నుంచి 6 వరకు క్రీడాకారుల పోటీలకు జట్టును ఎంపిక చేశారు. కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సింగారపు తిరుపతి, ఉపాధ్యక్షుడు బొద్దు రాములు, వ్యాయామ ఉపాధ్యాయులు జోగినపల్లి రవీందర్‌రావు, సంతోష్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలోచించి ఓటేయాలి..



వేములవాడలో సీఎం కేసీఆర్

ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన జనం

- వేములవాడ, జగిత్యాలలో సీఎం ప్రజా ఆశీర్వాద సభ
- వేములవాడలో లక్ష్మీనర్సింహారావుకు మద్దతుగా సభ
- కలికోట సూరమ్మ ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ తరఫున ప్రచారం

వేములవాడ/జగిత్యాల: సీఎం కేసీఆర్ ఆదివారం ఉమ్మడి జిల్లాలోని వేములవాడ, జగిత్యాల నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. వేములవాడలో మాట్లాడుతూ.. లక్ష్మీనర్సింహారావు యువకుడని, కచ్చితంగా అభివృద్ధి చేసి తీరుతాడని వెల్లడించారు. రమేశ్‌బాబు గొప్ప వ్యక్తి అని, కోర్టు కేసులతోనే ఆయనను మార్చాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ హయాంలో వేములవాడ, సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతాలను కల్లోలిత ప్రాంతంగా ప్రకటించిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మరాజ్యం తెస్తామంటున్నారని.. ఇందిరమ్మ రాజ్యం బాగుంటే ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని ఎందుకు పెట్టేవారని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యం వస్తే మళ్లీ ఆకలికేకలు వినిపిస్తాయన్నారు. కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని ప్రకటించారు.

భావోద్వేగానికి గురైన ఎమ్మెల్యే రమేశ్‌బాబు

సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో ముందుగా ప్రసంగించిన ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఈ ప్రాంత సమస్యలు సీఎంకు వివరిస్తూనే భావోద్వేగానికి గురయ్యారు. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కలికోట సూరమ్మ ప్రాజెక్టు, ముంపు గ్రామాల సమస్య, డిగ్రీ కాలేజీలు ఏర్పాటు చేయాలని కోరారు.

జగిత్యాలలో మాట్లాడుతూ..

జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభలో సీఎం మాట్లాడుతూ.. మూడోసారి అధికారం చేపట్టి జగిత్యాలను కరీంనగర్‌లా మార్చుతామన్నారు. ప్రజలు ఆగం కావొద్దని, ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను రెండోసారి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తారని వెల్లడించారు. కాంగ్రెస్ హయాంలో నీరు లేక, ఉద్యోగాలు లేక, కరెంట్ లేక గోస పడ్డామని, రైతుల ఆత్మహత్యలు, ఎన్నో ఘోరాలు చూశామని, తెలంగాణ తెచ్చుకున్నాక ఆ సమస్యలన్నీ తీరాయని వెల్లడించారు. జిల్లా అభివృద్ధి కళ్లముందే కనబడుతోందని, మెడికల్ కళాశాల, వరదకాలువ, సంక్షేమ పథకాలు కనిపిస్తున్నాయని తెలిపారు. రైతు రాజు కావాలనే ఉద్దేశంతో రైతుబంధు ఇస్తున్నామని, రైతులు ఎలాంటి సమస్యతో చనిపోయినా రైతుబీమా అందిస్తున్నామని వివరించారు. సాగునీటి సమస్య లేకుండా చేయడంద్వారా జిల్లా మొత్తం ధాన్యంరాశులతో నిండిపోయిందన్నారు. నీటిపన్ను లేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనని అన్నారు. జిల్లాలో బస్తీ దవాఖానాలు, రోళ్లవాగు ప్రాజెక్ట్, వరద కాలువ వంటి అనేక పనులు చేసుకున్నామని వివరించారు. పొరబాటున కాంగ్రెస్ వస్తే కరెంట్ మళ్లీ మూడు గంటలే వస్తుందన్నారు.

ప్రాణమున్నంత వరకు సేవ చేస్తా



ప్రాణమున్నంత వరకు ఈ ప్రాంతానికి సేవ చేస్తానని బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు పేర్కొన్నారు. ప్రజాసేవ కోసమే ఇక్కడికి వచ్చానని, తనకు టికెట్ ఇచ్చి ఆశీర్వదించిన సీఎం కేసీఆర్ రుణం తీర్చుకుంటానన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలందిస్తానని పేర్కొన్నారు. వేములవాడ ముఖచిత్రం మార్చడమే తన ధ్యేయమన్నారు.

మళ్లీ గెలిపిస్తే.. మరింత అభివృద్ధి



ఎల్లారెడ్డిపేటలో రోడ్‌షోకు హాజరైన జనం



గంభీరావుపేటలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

- బీఆర్ఎస్‌తోనే సుస్థిర పాలన
- కాంగ్రెస్‌కు ఓటేస్తే మూడు గంటల కరెంట్
- రోడ్‌షోలలో మంత్రి కేటీఆర్

ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట/వీర్నపల్లి/గంభీరావుపేట: తొమ్మిదిన్నరేళ్లలో సిరిసిల్ల నియోజకవర్గ ప్రజలు గర్వపడేలా పనిచేశానని.. మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పాలిచ్చే బర్రెను వదులుకొని దున్నపోతు లాంటి కాంగ్రెస్‌కు ఓటేయొద్దని.. సుస్థిర పాలనకు మూడోసారి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. జిల్లాలోని వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేటలలో ఆదివారం నిర్వహించిన రోడ్‌షోలలో పాల్గొని ప్రసంగించారు. అసైన్డ్ భూములపై రైతులకు సర్వహక్కులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆకలి చావులు తప్ప గంజినీళ్లు దొరకలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పాలనలో కరువు, కర్ఫ్యూ లేదన్నారు. మూడోసారి అధికారంలోకి రాగానే కొత్త రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, రూ.400కే సిలిండర్ అందిస్తామన్నారు. ఎల్లారెడ్డిపేటకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేశామని గుర్తుచేశారు. స్థానికంగా ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలను మాడ్రన్ పాఠశాలగా తీర్చిదిద్దామని, రానున్న కాలంలో జిల్లాలోని అన్ని పాఠశాలలను ఆధునికంగా తీర్చిదిద్దుతామన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, సర్పంచ్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు నాగరాణి, అనసూయ, నాయకులు అందె సుభాష్, రమేశ్‌గౌడ్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే 24 గంటల కరెంట్

బీఆర్ఎస్‌కు ఓటు వేస్తేనే 24 గంటల కరెంట్ వస్తుందని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. వీర్నపల్లిలో రోడ్‌షోలో పాల్గొనేందుకు హెలికాప్టర్ ద్వారా కోనరావుపేటలోని మరిమడ్లకు వచ్చిన మంత్రి గ్రామస్తులతో ముచ్చటించారు. గ్రామంలో ఆస్పత్రి నిర్మాణానికి, ఫంక్షన్‌హాల్ ఏర్పాటునకు స్థలాన్ని పరిశీలించారు. కేటీఆర్ బంధువు భాస్కర్‌రావు, సర్పంచ్ మాట్ల అశోక్, ఉపసర్పంచ్ చంద్రమౌళి, లక్కం భాస్కర్ ఉన్నారు.

పుకార్లు నమ్మొద్దు

వీర్నపల్లిలోని రోడ్‌షోలో మాట్లాడుతూ సోషల్‌మీడియాలో వచ్చే పుకార్లను నమ్మొద్దని కోరారు. వీర్నపల్లిని మండలంగా, తండాలను గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాల నిర్మాణం, వీర్నపల్లిలోని వెంకట్రాయినిచెరువు నిర్వాసితులకు పరిహారం, రంగంపేటలోని సర్వేనంబర్ 10లోని రైతులకు పట్టాల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ కళావతి, ఎంపీపీ మాలోత్ భూల, సెస్ డైరెక్టర్ మల్లేశం, సర్పంచ్ దినకర్ పాల్గొన్నారు.

ఎగువమానేరును పర్యాటకంగా మారుస్తా..

నర్మాల ఎగువమానేరు పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని మంత్రి కేటీఆర్ అన్నారు. ఎగువమానేరు జలాశయంలో పేరుకుపోయిన పూడికను తీసి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతామన్నారు. గంభీరావుపేటలో సబ్‌ట్రెజరీ కార్యాలయం ఏర్పాటు, రోడ్డు విస్తరణ బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సిద్దిపేట, కామారెడ్డి ప్రధాన రహదారిపై హైలెవల్ బ్రిడ్జీలు నిర్మిస్తామన్నారు. సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, ఎంపీపీ వంగ కరుణ, జెడ్పీటీసీ కొమిరిశెట్టి విజయ, సెస్ డైరెక్టర్ నారాయణరావు, ఏఎంసీ చైర్మన్ హన్మంతరెడ్డి, బీఆర్ఎస్ జిల్లా, మండల, పట్టణశాఖ అధ్యక్షులు తోట ఆగయ్య, వెంకటస్వామిగౌడ్, వెంకటియాదవ్ ఉన్నారు.

హోమ్ ఓటింగ్ 92 శాతం

- 1,028 దరఖాస్తుల్లో 944 మంది ఓటు

సిరిసిల్ల: భారత ఎన్నికల సంఘం తొలిసారి ఇంటి వద్ద ఓటు(హోమ్ ఓటింగ్)కు అవకాశం కల్పించింది. జిల్లాలో హోమ్ ఓటింగ్‌ను 92 శాతం మంది వినియోగించుకున్నారు. జిల్లాలోని 80 ఏళ్ల పైబడిన వయసున్న వృద్ధులు, 40 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్న దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్నారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాలకు చెందిన 1,028 మంది దరఖాస్తు చేసుకోగా.. జిల్లాలో ప్రత్యేక బ్యాలెట్ పత్రాల ద్వారా ఆరు రోజులపాటు ఎన్నికల సిబ్బంది ఇంటి వద్ద ఓటింగ్ వేయించారు. 944 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో 92 శాతం ఇంటి వద్ద ఓటింగ్ నమోదైనట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. హోమ్‌ఓటింగ్ కోసం సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గంలో 5, వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గంలో 9 బృందాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది ఓటర్ల ఇంటికి వెళ్లి సాధారణ పోలింగ్ కేంద్రం మాదిరిగా ఏర్పాటు చేసి రహస్య విధానంలో హోమ్ ఓటింగ్‌కు అవకాశం కల్పించారు. ఇంటి వద్దకే వచ్చి ఓటు హక్కు కల్పించడంపై వయోవృద్ధులు, దివ్యాంగులు సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఈ విధానం దోహదపడింది.



దివ్యాంగుడికి ఇంకు పెడుతున్న సిబ్బంది

పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

- ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి

సిరిసిల్ల: ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది ఈనెల 29లోగా పోస్టల్ బ్యాలెట్‌లను వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి కోరారు. కలెక్టరేట్‌లో ఎన్నికల ఏర్పాట్లపై ఆదివారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న సిబ్బంది వినియోగించుకోవాలన్నారు. ఇప్పటికే ఓటర్లందరికీ ఓటరు సమాచారం స్లిప్పులను పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిపోయిన హోమ్ ఓటింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో, వేములవాడ ప్రభుత్వ హైస్కూల్‌లో ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఓట్ల లెక్కింపునకు రిసెప్షన్ ఏర్పాట్లు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, రిటర్నింగ్ అధికారులు ఎస్.ఆనంద్‌కుమార్, మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.గంగయ్య, డీఆర్‌డీవో శ్రీనివాస్, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, డీపీవో రవీందర్ పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి

నేతన్నల ఓట్లపైనే గురి

- అందరి చూపు.. సిరిసిల్ల వైపు
- మూడోవంతు ఓట్లు నేతన్నలవే..
- గెలుపోటములపై ప్రభావం

సిరిసిల్ల: నేతకార్మికులు అధికంగా ఉన్న సిరిసిల్ల కార్మికక్షేత్రంపైనే ప్రధాన పార్టీల అభ్యర్థులు దృష్టి సారించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే శక్తి స్థానిక నేతన్నలకు ఉంది. ఎన్నికల్లో నేతకార్మిక కుటుంబాల ఓట్లే కీలకంగా మారనున్నాయి. ప్రస్తుత ఎన్నికల్లో నిర్ణయాధికారం వారి చేతిలోనే ఉండడంతో నేతలంతా పట్టణంలోని ఓటర్లపై దృష్టిపెట్టారు. ప్రధాన పార్టీల అభ్యర్థులతోపాటు స్వతంత్ర అభ్యర్థులు సైతం నేతన్నల ఓట్ల కోసం పాట్లు పడుతున్నారు.

మూడో వంతు ఓట్లు

నియోజకవర్గంలో అత్యధికంగా ఓటర్లు సిరిసిల్ల కార్మికక్షేత్రంలోనే ఉన్నారు. మూడో వంతు ఓట్లు జిల్లా కేంద్రంలోనే ఉన్నాయి. గెలుపోటములను నిర్ణయించే శక్తి సిరిసిల్ల పట్టణ ఓటర్లకు ఉండడంతో నేతన్నల ఓట్లకు గాలం వేయాలని చూస్తున్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో మొత్తం 2,44,543 మంది ఓటర్లు ఉండగా, మహిళా ఓటర్లు 1,24,761, పురుష ఓటర్లు 1,19,778 మంది ఉన్నారు. జిల్లా కేంద్రంలో 80,443 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 40,975, పురుషులు 38,462 మంది ఉన్నారు. సిరిసిల్ల పట్టణ శివారులోని చంద్రంపేట, రాజీవ్‌నగర్, రగుడు, పెద్దబోనాల, చిన్నబోనాల, పెద్దూరు, సర్దాపూర్, జగ్గరావుపల్లి గ్రామాలు పట్టణంలో విలీనమయ్యాయి. మరోవైపు తంగళ్లపల్లి, ఇందిరమ్మకాలనీ, టెక్స్‌టైల్‌పార్క్, మండెపల్లి ఇందిరమ్మకాలనీల్లో నేతకార్మికులు అధికంగా ఉన్నారు. మొత్తంగా సిరిసిల్ల నియోజకవర్గంలో తంగళ్లపల్లి, ముస్తాబాద్, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ఐదు మండలాలతోపాటు సిరిసిల్ల మున్సిపల్ ఉంది. నియోజకవర్గం పరిధిలోని మూడు మండలాలతో సమానంగా ఒక్క సిరిసిల్ల పట్టణ ఓటర్లు ఉండడం విశేషం. రాష్ట్రంలోనే అత్యధికంగా 33వేల మరమగ్గాలు ఇక్కడే ఉన్నాయి. వీటికి అనుబంధంగా సైజింగ్, డైయింగ్, వార్పిన్ పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. పట్టణంలో పద్మశాలి సామాజికవర్గం ఎక్కువగా ఉంది. ఒక్క పద్మశాలి సామాజిక వర్గం ఓట్లే 62 వేల వరకు ఉంటాయని అంచనా. మిగతా ఐదు మండలాల్లోనూ పద్మశాలి సామాజికవర్గం ఓటర్లు మరో 20 వేల వరకు ఉంటారు. ఒక్క నేతకార్మిక వర్గానికి చెందిన ఓటర్లే 82 వేల మంది వరకు ఉంటారని అంచనా. ఒక్క వస్త్రపరిశ్రమనే కాకుండా బీడీకార్మికులు, ఇతర వృత్తులు, ఉద్యోగాల్లో పద్మశాలీలు అధికంగా ఉన్నారు. దీంతో వివిధ పార్టీల నేతలు నేతకార్మికుల ఓట్లపైనే గురిపెట్టి ప్రచారం చేస్తున్నారు.

ప్రధాన పార్టీలతోపాటు..

ఎన్నికల బరిలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరూ కూడా పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన వారు లేరు. ఇండిపెండెంట్లుగా ఇద్దరు పోటీచేస్తున్నారు. లగిశెట్టి శ్రీనివాస్, రిక్కుమల్ల మనోజ్ ఉండగా.. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున పత్తిపాక సురేశ్ పోటీలో ఉన్నారు. వీరంతా నేతకార్మిక సామాజికవర్గం కావడంతో వారికున్న సంబంధాలు, బంధుత్వాల మేరకు ప్రచారం చేస్తూ.. ఓట్లు సాధించాలని భావిస్తున్నారు. మరోవైపు ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీలు సైతం ఆయా సామాజికవర్గాల వారిని కలుపుకుని ముందుకుసాగుతున్నారు. సిరిసిల్ల బరిలో మొత్తం 21 మంది ఉన్నారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్న పద్మశాలి సామాజికవర్గం నేతలు సాధించే ఓట్లను బట్టి ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయిస్తాయి. దీంతో అందరి దృష్టి సిరిసిల్ల నేతన్నలు, ఆయా ప్రాంతాల్లోని పద్మశాలి సామాజికవర్గం ఓటర్లపై పడింది.



సిరిసిల్లలో సాంచాలు నడుపుతున్న నేత కార్మికులు

వస్త్రపరిశ్రమ సమస్యలే ప్రచారాస్త్రాలు

- ప్రభుత్వ వస్త్రోత్పత్తి ఆర్డర్లతో నేతకార్మికుల ఆత్మహత్యలను నివారించామని, బతుకమ్మ చీరల ఆర్డర్లతో నేతన్నల్లో భరోసా కల్పించామని సీఎం కేసీఆర్ ఇటీవల బహిరంగ సభలో ప్రకటించారు.
- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కె.కె.మహేందర్‌రెడ్డి స్థానికుడిని అందుబాటులో ఉంటాను.. ఐదు జోడీ(పది సాంచాల)లకు ఉచితంగా కరెంట్ ఇస్తామని హామీ ఇస్తున్నారు. నేతన్నలకు శాశ్వత ఉపాధి కల్పిస్తామని, అందరికీ ప్రభుత్వ ఆర్డర్లు దక్కేలా చూస్తామని యారన్ డిపో (నూలు)లు ఏర్పాటు చేస్తామని ప్రచారం చేస్తున్నారు.
- బీజేపీ అభ్యర్థి రాణిరుద్రమరెడ్డి అందరి కంటే ఒక్క అడుగు ముందుకేసి సిరిసిల్లకు పవర్‌లూమ్ క్లస్టర్ సాధిస్తానని బాండ్ పేపర్ రాసిచ్చారు. ఇదే ప్రచార అస్త్రంగా ఇంటింటికి బాండ్ పేపర్‌ను పంపిణీ చేయిస్తున్నారు. ఇలా ప్రధాన పార్టీల అభ్యర్థులు నేతన్నల ఓట్లను సాధించేందుకు ప్రచారాస్త్రాలను సంధిస్తున్నారు.

సిరిసిల్ల నియోజకవర్గంలో ఓటర్లు ఇలా..

మండలం	పురుషులు	మహిళలు	థర్డ్ జెండర్	మొత్తం
వీర్నపల్లి	5,657	5,713	0	11,370
ఎల్లారెడ్డిపేట	19,566	20,614	0	40,180
గంభీరావుపేట	17,549	18,434	1	35,984
సిరిసిల్ల	38,462	40,975	6	80,443
తంగళ్లపల్లి	18,519	19,361	0	37,880
ముస్తాబాద్	18,910	19,659	0	38,569
ఎన్ఆర్ఐ	12	02	0	14
సర్వీస్	103	03	0	103
మొత్తం	1,19,778	1,24,761	7	2,44,543

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి

కోనరావుపేట: ట్రాక్టర్‌తో పొలం దున్నతుండగా బోల్తాపడి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని నిజామాబాద్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఈర్ల లచ్చయ్య-లక్ష్మి దంపతుల కుమారుడు బాబు (24) వెంకట్రావుపేట-నిజామాబాద్ గ్రామాల మధ్య ఉన్న పొలం వద్దకు వెళ్లాడు. ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా బోల్తాపడడంతో బాబు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందా డు. మృతుడికి భార్య నేహా, కుమారుడు విఘ్నేష్ (4), కూతురు తన్విత (3) ఉన్నారు. మృతుడి తండ్రి లచ్చయ్య ఫిర్యాదు మేరకు ఎస్సై ఆంజనేయులు, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి సంఘటన స్థలాన్ని సందర్శించారు. గ్రామస్తుల సా యంతో మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని యువకుడికి గాయాలు


గాయపడిన సాయికృష్ణ

తంగళ్లపల్లి (సిరిసిల్ల): మండలకేంద్రంలో ఆదివారం ఓ పార్టీకి చెందిన ర్యాలీ ఉండటంతో ట్రాఫిక్‌ను వన్‌వేలో మళ్లించారు. దీంతో ఎదురెదురుగా వెళ్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. తంగళ్లపల్లి గ్రామానికి చెందిన చుక్క రాజశేఖర్, అంకారపు సాయికృష్ణ వెళ్తుండగా పెద్దలింగాపూర్‌కు యువకుడు బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో సాయికృష్ణ తలకు తీవ్రగాయాలు, రాజశేఖర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు.

రాజన్న కోడెలు మృత్యువాత



వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లోని శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం గోశాలలోని మూడు కోడెలు ఆదివారం మృతిచెందినట్లు సీనియర్ అసిస్టెంట్ శ్యామ్ తెలిపారు. రోగాల బారినపడి చికిత్స అందించినా నయంకాక మృత్యువాత పడినట్లు తెలిపారు.

బీఎస్పీ అభ్యర్థి వాహనంపై దాడి

చందుర్తి (వేములవాడ): నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి గోలి మోహన్‌పై మండలకేంద్రంలో ఆదివారం దాడిచేశారు. మండలకేంద్రంలోని బీఎస్పీ పార్టీకి చెందిన కార్యకర్త మృతిచెందడంతో పరామర్శించేందుకు వెళ్లిన తమ వాహనంపై బీఆర్ఎస్ కార్యకర్తలు దాడి చేశారంటూ ఆరోపించారు. మహిళా కార్యకర్తపై దుర్భాషలాడి, కులం పేరుతో దూషించారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై పోలీసుల వివరణ కోరగా విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. తమ రెండు వాహనాలపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎక్కడ ఉన్నా.. ఇక్కడే ఓటు

- సొంతగడ్డపై చెరగని మమకారం
- ఓట్ల పండుగకు ఎదురుచూపులు
- ఎన్నిక ఏదైన రావడం పక్కా
- సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న ఓటర్లు
- ప్రాంతం అభివృద్ధిలో భాగస్వామ్యం


సిరిసిల్ల పట్టణం


సిరిసిల్లలోనే నేతన్నచౌక్

సిరిసిల్లటౌన్: వారంతా.. సిరిసిల్ల ప్రాంత వాసులు. ఉపాధి, ఉద్యోగం, వ్యాపార నిమిత్తం ఇతర రాష్ట్రాలు, దేశాలు, సుదూర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. దశాబ్దాలు గడుస్తున్నా పుట్టిన గడ్డపై తీరని మమకారాన్ని నిలుపుకుంటున్నారు. ప్రతిరోజు వార్తలు వినేటప్పుడు మా ఊరి ముచ్చట ఏంటిది? అని ఎదురుచూస్తుంటారు. ఇక ఎన్నికలు వస్తే.. పనులు వదులుకుని దూరం, ఖర్చులు, సమయం, శారీరక శ్రమను లెక్కచేయకుండా సిరిసిల్లకు చేరుకుంటున్నారు. తాము ఎక్కడ ఉన్నా.. పుట్టిన గడ్డ అభివృద్ధిలో తమ వంతు తమ వంతు భాగస్వామ్యంగా ఓటుస్వామ్యాన్ని వినియోగించుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా గల్ఫ్‌కార్మికులతోపాటు ముంబై, సూరత్, పూణె, నాందేడ్, షోలాపూర్, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ వంటి ప్రాంతాలు.. ఇతర దేశాల్లో సుమారు 40 వేల మంది ఉపాధి అవకాశాల కోసం వెళ్లారు. వారంతా తమ ఓటుహక్కును ఇక్కడే వినియోగించుకుంటున్నారు. మామూలుగైతే బతుకమ్మ, దసరా పండుగలకు వచ్చే స్థానికులు.. ఓట్ల పండుగ కోసం ఇక్కడికి బాట పట్టారు. మున్సిపల్, గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, సెస్, శాసనసభ, లోక్‌సభ ఎన్నికలకు వచ్చి ఓట్లు వేస్తూ సొంతగడ్డపై అభిమానాన్ని చాటుకుంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఓట్లు వేస్తూ.. ఇక్కడి నాయకత్వాన్ని బలపరుస్తున్న పలువురు ఓటర్ల మనోగతం వారి మాటల్లోనే..

నేను పుట్టిన నేల జీవధాతువు



నేను పుట్టిన ఈ నేల నాకు జీవధాతువు. నేను ఎక్కడ ఉన్నా నాజీవ గడ్డ అభ్యున్నతే కోరుతా. ఉద్యోగరీత్య హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు ఇలా ఎక్కడ ఉన్నా ఓటు మాత్రం సిరిసిల్లలోనే వేస్తాను. మున్సిపల్ మొదలుకుని ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలకు పాతికేళ్లుగా వచ్చి ఓటు వేస్తున్నా.

– పత్తిపాక మోహన్, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత

నలభై ఏళ్లుగా వస్తున్నా..



మేము నలభై ఏళ్ల క్రితమే నాందేడ్‌కు వలస వెళ్లాం. అక్కడే అక్కడే వ్యాపారం చేస్తూ స్థిరపడ్డాం. ఇప్పటికీ మా ఇంటిల్లిపాదికి మా సొంతూరు గంభీరావుపేట మండలం ముచ్చర్లలో ఓటుహక్కు ఉంది. ఎన్నికలప్పుడు వచ్చి ఓటు హక్కును వినియోగించుకుంటాం. మంచి నాయకత్వం రావాలన్నదే మా ఆశ.– గున్నాల వెంకటలక్ష్మి, ముచ్చర్ల

సొంతూరిపై మమకారం



ఉపాధి, ఉద్యోగరీత్య సిరిసిల్లను వదిలి హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. ఓటును మాత్రం పుట్టినూరు సిరిసిల్లలో వేయడమే నాకిష్టం. నా నియోజకవర్గం అభ్యున్నతికి పాటుపడే నాయకులకు ఓటు వేస్తుంటాను. ఎన్నికల రోజున ఎన్ని పనులున్నా వచ్చి ఓటు వేసి పోతాను.

– ఆడెపు వినోద్‌కుమార్

ముంబై నుంచి వస్తాం



ఎన్నికలు వస్తే ఎలాంటి ఆలోచన లేకుండా ముంబై నుంచి సిరిసిల్లకు వచ్చేస్తాం. పాతికేళ్ల క్రితమే ముంబైకి వలసపోయి అక్కడే టైలరింగ్ పనితో ఉపాధి పొందుతున్నాం. ముంబైలోనే సెటిల్ అయ్యాం. అయినా మాకు ఓటుహక్కు ఇక్కడే ఉంది. ప్రతీ ఎన్నికకు తప్పనిసరిగా వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటాం. – గాజుల వీణ, టైలర్

నా ఊరిలోనే ఓటేస్తా



పుట్టిన ఊరిలోనే ఓటేస్తా. చాలా కాలంగా హైదరాబాద్‌లోనే ఉంటున్నాం. 2009 నుంచి ఎన్నికలు వచ్చిన ప్రతీసారి సిరిసిల్లకు వచ్చి ఓటేస్తాను. కౌన్సిలర్ నుంచి ఎంపీ ఎన్నికల వరకు దేనిని మిస్స్ కాలేదు. నేను ఎక్కడ ఉన్నా సిరిసిల్ల స్థానికుడిగానే గర్విస్తా.

– నాగుల పూర్ణచందర్, సాఫ్ట్‌వేర్, ఉద్యోగి

పండుగ వంటిదే..



పాతికేళ్ల క్రితమే హైదరాబాద్‌లో స్థిరపడ్డాం. ఎన్నికలు వచ్చాయంటే పెద్ద పండగలా ఫీలై అమ్మానాన్నల వద్దకు వచ్చి వారితోపాటు సిరిసిల్లలో ఓట్లేస్తాం. మన నాయకున్ని మనమే ఎన్నుకున్నామన్న సంతృప్తి ఉంటుంది. నేను ప్రతి ఎన్నికల రోజున సిరిసిల్ల వచ్చి ఓటేస్తా.

– మ్యాన ప్రవీణ్, ప్రైవేటు ఉద్యోగి

రూ.50లక్షల నగదు పట్టివేత

రామగుండం: రామగుండం బైపాస్ వద్ద పోలీసులు ఆదివారం రాత్రి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నిబంధనల్లో భాగంగా రామగుండం సీఐ చంద్రశేఖర్‌గౌడ్, ఎస్సై వెంకట్, ఫ్లయింగ్ స్క్వాడ్ టీం(ఎఫ్ఎస్‌టీ) స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ చేశారు. ఈక్రమంలో గోదావరిఖని నుంచి రామగుండం వైపు వస్తున్న ఇన్నోవా వాహనంలో సోదాలు చేశారు. ఇందులో రూ.50లక్షల నగదు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నగదుకు సంబంధించి సదరు వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు చూపించలేదన్నారు. నిబంధనల మేరకులా సొమ్ము సీజ్ చేసినట్లు పోలీసులు వివరించారు.

ఇంటి ప్రహరీని ఢీకొట్టిన ట్రాక్టర్

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్‌లో శనివారం అర్ధరాత్రి తిప్పాపూర్‌కు చెందిన ఓ వ్యక్తి పార్కింగ్‌లో పెట్టిన ట్రాక్టర్ నడిపించడంతో అదుపుతప్పి పులి పర్శయ్య ఇంటి ప్రహరీని ఢీకొట్టింది. ఆ సమయంలో అక్కడ ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. పర్శయ్య పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

పంచాయతీ సెక్రెటరీలకు పోస్టల్‌బ్యాలెట్ లేనట్లే !

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రాజ్యాంగం ప్రతి పౌరునికి కల్పించిన ఓటుహక్కుకు జిల్లాలోని సుమారు 70 మంది పంచాయతీ కార్యదర్శులు దూరమయ్యారని తెలుస్తోంది. జిల్లా అధికారుల ఉదాసీనత, నిర్లక్ష్యంతో ఇతర జిల్లాల నుంచి రాజన్నసిరిసిల్ల జిల్లాలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు తమ సొంతూళ్లకు వెళ్లి ఓట్లు వేయకుండా డ్యూటీలోనే ఉండాల్సి వచ్చింది. అదే సమయంలో వారికి పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాల్సి ఉండగా.. జిల్లాలో మాత్రం అవకాశం ఇవ్వకపోవడంతో ఓటుహక్కు వినియోగాన్ని కోల్పోతున్నారు. అదే సమయంలో పోస్టింగ్ ఉన్న గ్రామం విడిచి వెళ్లకూడదని ఆదేశించడంతో అయోమయంలో పడ్డారు. ఈ విషయంపై ఎన్నికల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు.


స్వామివారి కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

కమనీయం నృసింహుని కల్యాణం

రుద్రంగి: మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కొమిరె శంకర్ దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఆవరణలో ప్రత్యేక వేదికపై ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఉంచి వాటికి మంగళ స్నానాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ప్రధానార్చకులు శ్రీనివాస శర్మ నేతృత్వంలోని వేదపండితుల బృందం వేదమంత్రోచ్చరణల మధ్య స్వామివారి కల్యాణం జరిగింది. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నిఏర్పాట్లు చేశారు. రుద్రంగి సర్పంచ్ తర్రె ప్రభలత, ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసి గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఏఎంసీ వైస్ చైర్మన్ కంటి రెడ్డి, నాయకులు మాడిశెట్టి ఆనందం, తీపిరెడ్డి వెంకట్‌రెడ్డి, కేసిరెడ్డి నర్సారెడ్డి, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, మంచె రాజేశం, ఎర్రం గంగనర్సయ్య, నంద్యాడపు వెంకటేశ్, స్వామి, గణేశ్, పిడుగు లచ్చిరెడ్డి, ఇప్ప మహేష్, దయ్యాల కమలాకర్, పెద్ద ఎత్తున భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

స్వామివారి జాతర, అన్నదానం

సన్నిధిలో సోమవారం జాతర (తిరునాళ్లు) జరగనున్నాయి. లక్ష్మీ నర్సింహస్వామి జాతరకు చుట్టుపక్కల నుంచి ప్రజలు పెద్దఎత్తున హాజరుకానున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొమిరె శంకర్ తెలిపారు. గరుఢసేవ, సాయంత్రం యక్షగాన కార్యక్రమం నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం స్వామి వారి రథోత్సవం గ్రామంలో ఊరేగింపు నిర్వహించనున్నారు.

ఉద్యోగావకాశాలు కల్పించాలి

- యువత ఓటు వేసే ముందు ఆలోచించాలి
- విద్యార్థుల మనోగతం

పీపుల్స్ ఎజెండా

వేములవాడఅర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత. రాజ్యాంగం కల్పించిన ఈ హక్కుతో మనల్ని బాగు చేసే నాయకులను ఎన్నుకునే అవకాశం మనకు దక్కింది. ప్రజలకు అందుబాటులో ఉంటూ మంచి పని, అభివృద్ధి చేసే నాయకుడినే ఎన్నుకుంటామని యువత పేర్కొంటున్నారు. మద్యం, డబ్బుకు లొంగకుండా ఓటు వేస్తే ఎలాంటి నాయకుడినైన ప్రశ్నించే అవకాశం ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా వారి అభిప్రాయాలు..

ఉద్యోగాలు కల్పించాలి



ఏ పార్టీ గెలిచినా ఉద్యోగ నోటిఫికేషన్లు విధిగా వేయాలి. ఉద్యోగాలు లేక యువత ఆగమాగమవుతున్నారు. ఆలోచించి మంచి నాయకుడికే ఓటు వేయాలి.

– యశ్వంత్

అభివృద్ధిని కోరుకోవాలి



మన ప్రాంతం అభివృద్ధి ఎవరితో సాధ్యమవుతుందనుకుంటున్నామో వారికే ఓటు వేయాలి. యువత ఆలోచించి ఓటు వేయండి. అభివృద్ధి చేసే నాయకుడికే ఓటు వేస్తాను.

– జాషువ

ఓటుహక్కు వినియోగించుకోవాలి



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం. ప్రతి ఒక్కరూ తమ ఓటుహక్కును వినియోగించుకోవాలి. మన ఓటుతో ప్రజలకు సేవ చేసే నాయకుడిని ఎన్నుకోవాలి.

– హర్షిణి

విద్యకు పెద్దపీట వేయాలి



సమాజంలో ఎక్కువగా అవసరమైనది వైద్యం, విద్య, ఉద్యోగం. ఏ ప్రభుత్వం వచ్చిన ఈ మూడింటికి పెద్ద పీట వేయాలి. నిరుపేదలు వారి ఆదాయంలో పెద్ద మొత్తం ఈ మూడింటిపైనే ఖర్చు పెడుతున్నారు. వీటిని ప్రజలకు ఉచితంగా అందించాలి.

– ఉషారాణి

ఓటును అమ్ముకోవద్దు



ఓటును అమ్ముకోవద్దు. మందుకు, డబ్బులకు ఓటును అమ్ముకుంటే రేపు అభివృద్ధి చేయాలని గెలిచిన నాయకుడిని అడగలేవు. అందుకే అందరూ స్వచ్ఛందంగా ఓటు వేయాలి.

– వంశీకృష్ణ

మహిళలకు రక్షణ కల్పించాలి



మహిళలకు రక్షణ కల్పించాలి. ప్రతి మహిళ ఇంటి నుంచి బయటకు వెళ్లడానికి పూర్తి స్వేచ్ఛ ఉండాలి. పనిచేసే నాయకుడిని, పనిచేసే ప్రభుత్వాన్ని ఓటుహక్కుతో ఎన్నుకోవాలి.

– ఐశ్వర్య

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మాచారెడ్డి: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని ఘన్‌పూర్ శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు. గంభీరావుపేట మండలం గజసింగవరం గ్రామానికి చెందిన పంతం సుమన్(35) సొంత పనినిమిత్తం కామారెడ్డి జిల్లా మాచారెడ్డికి వెళ్లాడు. రాత్రి స్వగ్రామానికి వెళ్తుండగా ఘన్‌పూర్ శివారులో బైక్ అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం స్థానికులు 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పురిట్లోనే శిశువు మృతి..

- వైద్యుల నిర్లక్ష్యంవల్లేనని బంధువుల ఆందోళన
- సిరిసిల్ల జిల్లాసుపత్రిలో ఘటన


ఆస్పత్రిలో ఆందోళన చేస్తున్న బంధువులు


పసికందు మృతదేహం

సిరిసిల్లటౌన్: మెరుగైన వైద్యం అందుతుందని జిల్లాసుపత్రికి వస్తే..పురిట్లోనే పసికందు మృతిచెందిన సంఘటన సిరిసిల్లలో చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం..బీవైనగర్‌కు చెందిన బల్ల మీనాక్షిను భర్త శ్రీకాంత్ శనివారం సాయంత్రం డెలివరీ కోసం జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చాడు. అడ్మిట్ చేసుకున్న వైద్యులు ఆదివారం ఉదయం తమకు ఎలాంటి సమాచారం లేకుండానే డెలివరీ చేశారని, మృతిచెందిన పసికందు పుట్టిందని చెప్పడంతో కన్నీరుమున్నీరయ్యారు. తాము ఆస్పత్రికి తీసుకువచ్చినప్పుడు ఆపరేషన్ చేయకుండా నిర్లక్ష్యం చేసిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు. ఇందులో తమ పొరపాటు ఏమీలేదని, ఇతర కారణాల వల్ల శిశువు మృతిచెందిందని పేర్కొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న పండితులు


స్వామివారి ఊరేగింపు

హనుమంత వాహనంపై ఊరేగింపు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలకేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం హనుమంత వాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఉదయం నిత్యారాధన, శ్రీ సుదర్శన నరసింహ హవనం, పూర్ణాహుతి, నివేదన, తీర్థప్రసాద వితరణ, సాయంత్రం శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను హనుమంత వాహనంపై ఊరేగించారు. మహిళలు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం స్వామివారి పెద్ద రథం ఊరేగింపు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్, వైస్ చైర్మన్ గంట వెంకటేశ్ గౌడ్, వేద పండితులు నవీన్ చారి, వేణుగోపాల చారి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.